జనరంజక పాలనకు జేజేలు

- ప్రగతిపథంలో గుంతకల్లు నియోజకవర్గం
- నవరత్నాలతో పేదప్రజల జీవితాల్లో వెలుగులు
- సంక్షేమ పథకాలతో రూ.2,887.86 కోట్ల లబ్ధి
- నాలుగేళ్లలో రికార్డు స్థాయిలో అభివృద్ధి పనులు


గుంతకల్లు ప్రభుత్వాస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్(ఫైల్)


గుంతకల్లు కసాపురం రోడ్డులో ప్రారంభమైన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

గుంతకల్లుటౌన్: ఏపీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల జనరంజక పాలనకు గుంతకల్లు నియోజకవర్గం ప్రజలు జేజేలు పలుకుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయి. గ్రామ/వార్డు సచివాలయాలు, వలంటీరు వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలందుతున్నాయి. రైతుభరోసా కేంద్రాల ద్వారా అన్నదాతలకు సకాలంలో అన్ని రకాల సేవలందిస్తున్నారు. ఇక గుంతకల్లు నియోజకవర్గం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ సహకారం, స్థానిక ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి చొరవతో నియోజకవర్గం ప్రగతి పథంలో నడుస్తోంది. మనబడి నాడు-నేడు ద్వారా నియోజకవర్గంలోని ప్రభుత్వ బడుల రూపురేఖలు మారిపోయాయి. వైద్యరంగంలోనూ విప్లవాత్మకమైన మార్పులు జరిగాయి. నియోజకవర్గంలోని మూడు మండల కేంద్రాల్లో గల ప్రభుత్వ ఆస్పత్రులు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అభివృద్ధి జరిగాయి. ఎమ్మెల్యే పట్టణంలో వైఎస్సార్-వైవీఆర్ క్యాంటీన్‌ను ప్రారంభించి కేవలం రూ.6 కే మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. రెండు వైవీఆర్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేసి ఉచితంగా సేవలందిస్తున్నారు.

నెరవేరిన హామీలు
- గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్ ప్రారంభించం
- గుంతకల్లులో రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు
- పామిడి నగర పంచాయతీ మేజర్‌గ్రామ పంచాయితీగా మార్పు
- గుంతకల్లులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు రూ.34.74 కోట్లు మంజూరు
- గుంతకల్లు ఎస్‌డీపీఓ(డీఎస్పీ) పరిధిలోకి గుత్తి, పామిడి పోలీస్‌స్టేషన్లు
- హంద్రీనీవా కాలువ రాగులపాడు లిఫ్ట్ నుంచి నియోజకవర్గంలోని చెరువులకు నీరందించడానికి రూ.40.72 కోట్లు మంజూరు
- గుంతకల్లు ఎస్‌ఎస్.ట్యాంక్ సమీపంలో రూ.6 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ముస్లిం స్మశానవాటికకు కేటాయింపు

నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి పనులు
- గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి రూ.14.85 కోట్లు
- పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి రూ.5.80 కోట్లు, గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి రూ.1.90 కోట్లు విడుదల
- మనబడి నాడు-నేడు మొదటి విడత కింద నియోజకవర్గంలోని 100 పాఠశాలల్లో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి
- గుంతకల్లులో ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాలకు నాబార్డు, ఆర్‌ఐడీఎఫ్ నిధులు రూ.20 కోట్లు మంజూరు
- గుంతకల్లు - కసాపురం వయా చెన్నప్పకొట్టాల మీదుగా రూ.4 కోట్లతో బీటీ.రోడ్డు నిర్మాణం పూర్తి
- గుంతకల్లు మున్సిపాల్టీలో మురికినీటిని శుద్ధిచేసే ప్లాంటు(ఎస్‌టీపీ) ఏర్పాటుకు రూ.26 కోట్లు
- గుత్తి పట్టణ ప్రజలకు తాగునీటిని అందించడానికి వాటర్‌గ్రిడ్ ద్వారా పెనకచెర్ల డ్యామ్ నుంచి గుత్తికి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు, నీటి సరఫరా కోసం రూ.160 కోట్ల మంజూరు
- గుంతకల్లు, గుత్తి మున్సిపాల్టీల్లో రూ.1.70 కోట్లతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు
- గుంతకల్లు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పార్కులు ఏర్పాటు
- నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం నియోజకవర్గంలో వేగంగా జగనన్న లేఔట్లు, టిడ్కో ఇళ్ల నిర్మాణాలు
- నియోజకవర్గంలో వైఎస్సార్ అర్బన్ హెల్త్‌క్లినిక్‌ల ప్రారంభం

జగనన్న సహకారంతోనే అభివృద్ధి



భారతదేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవన ప్రమాణాలు, వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచారు. విప్లవాత్మక సంస్కరణలతో విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామికరంగాల అభివృద్ధి చేశారు. నాలుగేళ్ల పాలనలో నవశకానికి నాంది పలికి దేశానికే ఆదర్శ సీఎంగా జగన్ చరిత్ర సృష్టించారు. ప్రజలంతా మళ్లీ జగనన్నే రావాలని కోరుకుంటున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారం, నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో గుంతకల్లు నియోజకవర్గం అభివృద్ధికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాం.
– వై.వెంకటరామిరెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే

నాలుగేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు

(జూన్-2019 నుంచి మే 2023 వరకు)
నియోజకవర్గానికి మంజూరైన పనులు– 26,986
అభివృద్ధి పనుల అంచనా వ్యయం – రూ.2,683.88 కోట్లు
ఇప్పటివరకు పూర్తయిన పనులు– 7,989
పురోగతిలో ఉన్న పనులు– 3,680
అభివృద్ధి పనులకు ఇప్పటివరకు ఖర్చుచేసిన మొత్తం – రూ.646.29 కోట్లు

సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు జరిగిన మేలు
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాల ద్వారా గుంతకల్లు నియోజకవర్గంలోని ప్రజలకు నాలుగేళ్లల్లో భారీ లబ్ధి చేకూరింది.
సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి సంఖ్య–7,61,214 మంది
సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందిన మొత్తం రూ.2,887.86 కోట్లు

క్లుప్తంగా

రైలు ప్రమాద మృతులకు నివాళి


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: ఒడిషా రాష్ట్రంలోని బాలసోర్‌లో శుక్రవారం రాత్రి రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి కుటుంబాలకు సీపీఐ నాయకులు సంతాపం తెలియజేశారు. శనివారం స్థానిక గాంధీ సర్కిల్ వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని, మృతుల కుటుంబాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
గుంతకల్లుటౌన్: ఒడిషాలోని బాలాసోర్‌లో జరిగిన రైలుప్రమాద ఘటనలో మృతి చెందిన ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ శనివారం రాత్రి ఆ పార్టీ నాయకులు పొట్టిశ్రీరాములు సర్కిల్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ దుర్ఘటనకు కేంద్రప్రభుత్వం బాధ్యత వహించాలని, క్షతగాత్రులకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణ కార్యదర్శి జి.చిన్నా, పీఓడబ్ల్యూ కార్యదర్శి ఆశాబీ, నాయకులు జిలాన్, దేవేంద్ర, రఘునాథరెడ్డి, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వృత్తి విద్యా శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బాషా

తాడిపత్రి టౌన్: స్థానిక సత్యసాయి లక్ష్మీనారాయణస్వామి గ్రామీణ వృత్తి విద్యా శిక్షణా కేంద్రంలో(ఆర్‌వీటీసీ) 18వ బ్యాచ్ ఉచిత వృత్తి విద్యా శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. శిక్షణ మూడు నెలలు పాటు జరుగుతుందని, ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు శిక్షణ కేంద్రం కో ఆర్డినేటర్ గంగాధర్ తెలిపారు. ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, ప్లంబ్లింగ్, గృహోపకరణాలు(ఫ్యాన్, మిక్సీ,కూలర్, ఐరన్‌బాక్స్, ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు పరిష్కరించండి


అధికారులతో మాట్లాడుతున్న సాకే హరి

గార్లదిన్నె: ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ సంఘా ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్సీ,ఎస్టీ భూ సమస్యలపై ఆందోళన చేశారు ఈసంద ర్భంగా సాకే హరి మాట్లాడుతూ పెనకచెర్ల, జంబులదిన్నె, మర్తాడు, కోటంక, కల్లూరు, ఇల్లూరు గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూములు, ఇళ్లు, శ్మశాన వాటికలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. ఎస్సీ, ఎస్టీలు సాగులో ఉన్న భూములను ఆన్‌లైన్ చేయాలన్నారు. భూసమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. నాయకులు నాగరాజు, నరేష్, ప్రభాకర్, ఆనంద్, మల్లికార్జున, వలి, మహేష్, రామాంజనేయులు, రామకృష్ణ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడి సన్నిధిలో రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి


విశ్రాంత న్యాయమూర్తి ఉమాదేవికి స్వామి తీర్థప్రసాదాలు అందిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పోలీస్ గ్రీవెన్స్ అకాడమీ రాష్ట్ర అధ్యక్షురాలు, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి ఉమాదేవి శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మధ్యాహ్నం ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఆమెకు తీర్థ ప్రసాదాలు, స్వామి శేషవస్త్రాలు అందజేశారు.

మండలానికి ఇద్దరు నూతన కార్యదర్శులు


ఎంపీడీఓకు జాయినింగ్ రిపోర్టు అందిస్తున్న మునీంద్ర

పామిడి: బదిలీల్లో మండలానికి ఇద్దరు కొత్త పంచాయతీ కార్యదర్శులు వచ్చారు. దేవరపల్లి క్లస్టర్ పంచాయతీ కార్యదర్శిగా మునీంద్ర శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సుమలత గుత్తి మండలం కొజ్జేపల్లికి బదిలీపై వెళ్లారు. ఎద్దులపల్లి పంచాయతీకి తాడిపత్రి మండలం చుక్కలూరు నుంచి చంద్రమౌళి బదిలీపై రానున్నారు. ఎద్దులపల్లి కార్యదర్శిగా పనిచేస్తున్న షామీర్ గజరాంపల్లి పంచాయతీకి బదిలీ అయ్యారు. గజరాంపల్లి పనిచేస్తున్న నరేంద్ర తాడిపత్రి మండలం దిగువపల్లికి బదిలీపై వెళ్లారు.

మహిళ మృతి

పెద్దవడుగూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విరుపాపురానికి చెందిన మహిళ శనివారం అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(34) గతనెల 29న పెద్దవడుగూరులో పనులు ముగించుకొని కుటుంబ సభ్యుడు రామాంజనేయులుతో కలసి బైక్‌పై బయలుదేరింది. దారి మధ్యలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో భయాందోళనకు గురై బైక్‌పై నుంచి పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

శరవేగంగా రీ సర్వే పనులు

యల్లనూరు: మండలంలోని నిట్టూరు, కాచర్లకుంట గ్రామాల్లో రీ సర్వే పనులు శరవేగంగా జరుగుతున్నాయని తహసీల్దారు సుమతి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాచర్లకుంటలో ఆరుగురు, నిట్టూరులో ఆరుగురు సర్వేయర్లు సర్వే చేస్తున్నారన్నారు. త్వరలో ఆరవేడులో రీ సర్వే ప్రారంభమవుతుందని తెలిపారు.

ప్రతి పేదింట్లో సంక్షేమకాంతులు


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి పేదల ఇంటిలో సంక్షేమకాంతులు వెదజల్లుతున్నాయని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శనివారం ఏదావులపర్తి, ఓబులాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ కలలగన్న గ్రామ స్వరాజ్యాన్ని జగనన్న ఏర్పాటు చేశారన్నారు. సచివాలయ, వలంటీరు వ్యవస్థలతో గ్రామాల్లో అన్నిరకాల సేవలు అందేలా చేశారన్నారు. చెరువులను నీటితో నింపి గ్రామాలను సస్యశ్యామలంగా మార్చారన్నారు. వైఎస్సార్‌యంత్ర సేవ కింద రైతులకు ట్రాక్టర్లు, యంత్రాలను అందిస్తున్నారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా అందించి రైతులకు అండగా నిలిచారన్నారు. గతంలో చంద్రబాబు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు. మహానాడులో అబద్ధాల టీడీపీ మ్యానిఫెస్టోను విడుదల చేసి జనాలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సంక్షేమంపై చంద్రబాబుకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. సీఎం జగన్ చేపడుతున్న అభివృద్ధిపై టీడీపీ నాయకులు ఓర్వలేక ఎల్లో మీడియా ద్వారా బురద జల్లుతున్నారని విమర్శించారు. అనంతరం రైతులతో కలసి సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, సీనియర్ నాయకులు ఆలూరి రమణారెడ్డి, తహసీల్దార్ రమాదేవి, వైఎస్సార్‌సీపీ యువనేత ఆలూరి ఎర్రిస్వామిరెడ్డి, ఎంపీడీఓ విజయభాస్కర్, సర్పంచ్ పార్వతి, కొండన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, నాయకులు పూల నారాయణ స్వామి, బుల్లే నారాయణస్వామి, చికెన్ నారాయణ స్వామి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మహానందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామాంజినరెడ్డి, పెద్దిరెడ్డి, రవి, శేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీరాములు, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు సీఎం వైఎస్ జగన్


పామిడిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు బాంధవుడని ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ రైతు భరోసా, యంత్ర సేవా పథకం సంబరాల్లో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో సీఎం జగన్ వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. వ్యవసాయానికి 7 గంటల నిరంతర విద్యుత్, రైతు భరోసా పథకంతో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రాయితీతో సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వ్యవసాయ పరికరాలు, పనిముట్లు, ట్రాక్టర్ల వంటి అందిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో సంక్షోభంలో కూరుకుపోయిన వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శి బీ రమణారెడ్డి, సింగిల్‌విండో మాజీ ప్రెసిడెంట్ చుక్కలూరు రామకృష్ణారెడ్డి, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు ఓబులాపురం ఓబులేసు, నక్కా ఓబులేసు, సునీల్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గోపాల్ నాయక్, లక్ష్మణ్, ఆది, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

శరవేగంగా నాయకునిపల్లి- గూగూడు రోడ్డు నిర్మాణం


పుట్లూరు మండలం నాయకునిపల్లి సమీపంలో నూతనంగా వేసిన రోడ్డు

పుట్లూరు: మండలంలోని నాయకునిపల్లి నుంచి గూగూడు వరకు రూ.8.2 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పుట్లూరు నుంచి నార్పలకు రాకపోకలకు ఈ రోడ్డు నిర్మాణం ప్రయోజనకరంగా మారింది. గతంలో రాళ్లమయంగా ఉన్న ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలు కష్టతరంగా ఉండేవి. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు నిర్మాణం పనులు చేపట్టడంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కానున్నట్లు అధికారులు తెలిపారు.

గుత్తి ఏడీఏగా వెంకటరాముడు



గుత్తి: గుత్తి ఏడీఏగా వెంకటరాముడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న నారాయణనాయక్ బదిలీ అయ్యారు. దీంతో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు అనంతపురంలో ఏడీఏగా పని చేస్తున్న వెంకటరాముడును ఇక్కడికి నియమించారు.

ఈఓఆర్‌డీగా మురళీకృష్ణ

శింగనమల: శింగనమల ఈఓఆర్‌డీగా మురళీకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఈఓఆర్‌డీ డీఎల్‌పీఓగా పదోన్నతిపై వెళ్లారు. కణేకల్లులో పని చేస్తున్న ఈఓఆర్‌డీ మురళీకృష్ణను ఇక్కడికి బదిలీ చేశారు. ఈఓఆర్‌డీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

సైకిల్ తొక్కితేనే ఆరోగ్యం

అనంతపురం: ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడం అలవాటు చేసుకోవాలని ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఏ మల్లికార్జున రెడ్డి అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-4 , నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ డేను పురస్కరించుకొని సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి రెక్టార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ


గంగాదేవిపల్లికి చెందిన సునీత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం క్రైం: ఎంపీ తలారి రంగయ్య శనివారం తన క్యాంపు కార్యాలయంలో పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. తాడిపత్రి గంగాదేవిపల్లికి చెందిన సునీత రూ.2.10 లక్షలు, తబ్జులకి చెందిన పాపక్క, లక్ష్మీదేవికు మంజూరైన రూ.1.20 లక్షలు ఎంపీ తలారి రంగయ్య వారి కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు.

రిజిస్ట్రేషన్ ఫీజులు తగ్గించాలని వినతి

గుత్తి: భూములు, ఇళ్లు, స్థలాల మార్కెట్ విలువ పెంచడం వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలు కావడంతో పాటు సామాన్యులు స్థలాలు కొనే స్థోమత కోల్పోతారని వెంటనే రిజిస్ట్రేషన్ ఫీజులు తగ్గించాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు సబ్ రిజిస్ట్రార్ గురునాథ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు లక్ష్మీనారాయణ(లచ్చి), డాకూ చాంద్, గోపాల్, మహేష్, ఆర్‌బీ కృష్ణమూర్తి, అశ్వ నాగప్ప , రంగస్వామి, శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ మార్కెట్ విలువ పెంచడం వల్ల సామాన్యులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గుత్తిలో అధికంగా రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచారన్నారు.

10న రాతిదూలం లాగుడు పోటీలు

పుట్లూరు: సి.వెంగన్నపల్లి లో ఈ నెల 10న రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. గ్రామంలో ఉమామహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పోటీలను ఏర్పాటు చేశామన్నారు. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10వేలు నగదు అందజేస్తామన్నారు. వీటితో పాటు పోటీలలో పాల్గొన్న ప్రతి జత వృషభాలకు రూ.3 వేలు ప్రోత్సాహకంగా అందిస్తామని వివరించారు.

మహిళా చట్టాలపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న డీఎస్పీ గంగయ్య

పెద్దపప్పూరు: సచివాలయ పరిధిలోని ప్రతి మహిళా పోలీసు తమ పరిధిలోని గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి మహిళా చట్టాలపై అవగాహన కల్పించాలని తాడిపత్రి డీఎస్పీ గంగయ్య సిబ్బందికి సూచించారు. శనివారం యాడికి పోలీస్‌స్టేషన్‌లోని సచివాలయాల మహిళా పోలీసులతో ఆయన సమావేశం నిర్వహించారు. దిశ యాప్ గూర్చి మహిళల్లో అవగాహన కలిగేలా వారి మొబైళ్లలో యాప్‌ను డౌన్ లోడ్ చేయించాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు నిఘా ఉంచి ఆయా గ్రామాల్లోని పరిస్థితులను సమీప పోలీస్‌స్టేషన్ ఎస్ఐ దృష్టికి తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో యాడికి సర్కిల్ సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ జిల్లా స్థాయి వైజ్ఞానిక శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న జేవీవీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్

గుత్తి: పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కాలేజీలో శనివారం జేవీవీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి(ఉమ్మడి జిల్లాలు అనంతపురం, సత్యసాయి) వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రంగన్న శిక్షణ తరగతులు ప్రారంభించారు. జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, వెంకటరామిరెడ్డి, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి మహేంద్రరెడ్డి, జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్, నాయకులు శ్రీధర్ గౌడ్, దేశాయి నాగరాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైజ్ఞానిక శిక్షణా తరగతులు ఎందుకు నిర్వహిస్తున్నది వివరించారు. ప్రతి ఒక్కరూ శాస్త్రీయతను అలవర్చుకోవాలన్నారు. ఆదివారం వైజ్ఞానిక శిక్షణా తరగతులు ముగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త వివాహానికి ఆర్థిక సాయం


చిన్నరాయుడుకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: వైఎస్సార్‌సీపీ గుంతకల్లు నియోజకవర్గం సోషియల్ మీడియా కోకన్వీనర్, పామిడి ఎస్సీసెల్ నేత చిన్నరాయుడు వివాహానికి గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. శనివారం ఎమ్మెల్యే వైవీఆర్‌ను ఆయన నివాసంలో కలిసి తన వివాహ ఆహ్వానపత్రికను అందజేసిన చిన్నరాయుడుకు నగదు అందించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ మాజీ కన్వీనర్ ఎద్దుల శంకర్ పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: బాణాసంచా కాలుస్తున్న సమయంలో గాయపడిన బాలుడి కుటుంబానికి శనివారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి రూ.25 వేలు అందజేశారు. దంచర్లలో ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సమయంలో టపాసులు పేలుస్తుండగా గ్రామానికి చెందిన సురేష్ కుమారుడు హర్షిత్ కంటికి గాయం అయింది. దీంతో ఎమ్మెల్యే హైదరాబాదులోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యమందేలా చూశారు. ఇటీవల బాలుడి ఇంటికి చేరుకోవడంతో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ఇంటికి పిలిపించుకొని చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం వారికి రూ.25 వేలు అందజేశారు.